క్లుప్తంగా

'పది' విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

ప్రత్తిపాడు: మండల పరిధిలోని చినకొండ్రుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. దాతలు గడ్డిపాటి పద్మారాణి, చాగంటి మహాలక్ష్మి సహకారంతో పది పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పెన్నులు, అట్టలు, స్కేల్, పెన్సిళ్లు, జామెంట్రీ బాక్సులు అందజేశారు. పాఠశాల హెచ్ఎం జంపని విజయ్‌కుమార్, పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు పోతురాజు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అపార్ట్‌మెంట్ ఫ్లాట్ దగ్ధం



గుంటూరు రూరల్: విద్యుత్ హై ఓల్టేజ్ వల్ల షార్ట్‌సర్క్యూట్‌కు గురై అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్ పూర్తిగా దగ్ధమైన ఘటన గురువారం నల్లపాడులో చోటు చేసుకుంది. బాధితుడు కేసరి శ్రీనివాసరెడ్డి తెలిపిన వివరాలు.. మధ్యాహ్నం సమయంలో ఒక్కసారిగా విద్యుత్ హైఓల్టేజ్‌కు గురై నల్లపాడు సచివాలయం వీధిలోని ఎంఆర్ఆర్ వ్యాలీలోని 101 ఫ్లాటులో మంటలు చెలరేగాయి. దీంతో అప్రమత్తమై విద్యుత్ శాఖ అధికారులకు ఫోన్ చేసి విద్యుత్ సరఫరాలను నిలిపివేసేలోగా మంటలు పూర్తిగా ఇంటిమొత్తం వ్యాపించాయి. ఇంట్లోని మంచం, విద్యుత్ ఉపకరణాలు, ఇతర వస్తువులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందించగా ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. ఘటనలో సుమారు రూ.7 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు ఫైర్ సిబ్బంది తెలిపారు. అదేవిధంగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పరిసర ప్రాంతాల్లో ఇళ్లలోని విద్యుత్ ఉపకరణాలు టీవీలు, ఏసీలు, ఇన్వర్టర్లు మరమ్మతులకు గురయ్యాయని స్థానికులు చెబుతున్నారు. ఘటనపై నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు.

పారా మెడికల్ ఉద్యోగులను రెగ్యులర్ చేయడంపై హర్షం

పెదకాకాని: కాంట్రాక్ట్ పారా మెడికల్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖ కాంట్రాక్ట్ పారా మెడికల్ సిబ్బంది అయిన స్త్రీ, పురుష ఆరోగ్య కార్యకర్తలు ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, తదితర క్యాడర్ల ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ గురువారం ఆదేశాలు జారీ చేయడంపైయునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షుడు వై. నేతాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అన్నమ్మ, జిల్లా అధ్యక్షుడు ఎ.జయరాజు ఒక ప్రకటన ద్వారా ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

జీజీహెచ్‌లో నర్సింగ్ విద్యార్థుల మధ్య రగడ

- మేల్ విద్యార్థులు కొట్టారంటూ ఫిమేల్ విద్యార్థుల ఫిర్యాదు
- విచారణ చేసిన అధికారులు

గుంటూరు మెడికల్: జీజీహెచ్ ఆవరణంలోని ప్రభుత్వ నర్సింగ్ పాఠశాలలో విద్యార్థుల మధ్య రగడ జరిగింది. గురువారం మేల్ నర్సింగ్ విద్యార్థులు తమపై దాడి చేశారంటూ ఫిమేల్ నర్సింగ్ విద్యార్థులు ఫిర్యాదు చేశారు. నర్సింగ్ విద్యార్థుల మధ్య గొడవ జరుగుతోందని జీజీహెచ్ అవుట్ పోస్టు పోలీసులకు సైతం ఫిర్యాదు వెళ్లడంతో పోలీసులు, ఆసుపత్రి అధికారులు నర్సింగ్ స్కూల్ వద్దకు చేరుకున్నారు. ఇటీవల నర్సింగ్ స్కూల్‌లో జరిగిన ఓ వేడుక నిర్వహణకు డబ్బులు వసూలు చేసే విషయంలో విద్యార్థుల మధ్య గొడవకు కారణమైనట్లు అధికారులు తెలిపారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశా సజని, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకటసతీష్‌కుమార్, నర్సింగ్ స్కూల్‌కు వెళ్లి విద్యార్థుల మధ్య విచారణ చేశారు. నర్సింగ్ స్కూల్‌లో ఫ్రెషర్స్ డే, ఫేర్‌వెల్ డే వేడుకలు ఇకనుంచి చేయడానికి వీల్లేదని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్‌కు ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ లోపిస్తే వారికి సీటు క్యాన్సిల్ చేసేందుకు వెనుకాడబోమని తెలిపారు. విద్యార్థుల చదువు విషయాలపై ప్రిన్సిపాల్ పర్యవేక్షణ చేయాలని, విద్యార్థుల హాజరు విషయాన్ని ట్యూటర్స్‌కు అప్పగించాలన్నారు. విద్యార్థులకు స్టయిఫండ్‌ను సకాలంలో చెల్లించాలని ఆదేశించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: సుదర్శిని కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం గుంటూరు మిర్చి యార్డులో కూలీలు, రైతులకు విజన్ ఆన్ వీల్ సంచార కంటి ఆసుపత్రిలో పరీక్షలు చేసి మందులు అందజేశారు. కంటి శుక్లాలు ఉన్నవారిని గుర్తించి తమ ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని హాస్పిటల్ అధినేత డాక్టర్ గణేశుని రాజేష్ తెలిపారు. ప్రతినెలా మొదటి మంగళవారం మిర్చి యార్డులో సుదర్శని కంటి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచితంగా కంటి వైద్యం అందిస్తామని చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ చెప్పారు. వైద్య శిబిరంలో డాక్టర్ సతీష్, ప్రశాంత్, సాయి పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దుర్గాభవాని
- ఘనంగా మహిళా దినోత్సవం



విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం



మలినేని కళాశాలలో దుర్గాభవాని, గీతాకుమారిలను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

ప్రత్తిపాడు: మహిళా సాధికారతకు మనమంతా కృషి చేయాలని బీసీ కార్పొరేషన్ గుంటూరు సౌత్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి. దుర్గాభవాని అన్నారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ముందస్తుగా మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి.దుర్గాభవాని, ట్రైనీ డీఎస్పీ పి.గీతాకుమారి హాజరయ్యారు. సమస్యలను చూసి మహిళలు వెనుకడుగు వేయకుండా అన్ని రంగాల్లోనూ ముందడుగు వేయాలని కోరారు. అప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుందని చెప్పారు. విద్యార్థినులు సరైన నిర్ణయాలు తీసుకుని వారి భవిష్యత్‌ను ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. ట్రైనీ డీఎస్పీ గీతాకుమారి మాట్లాడుతూ ఎలాంటి సమస్యనైనా ఎదుర్కొంటూ మహిళలు ధీరవనితలుగా రాణించాలని ఆకాంక్షించారు. మలినేని సంస్థల అధినేత పెరుమాళ్లు మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని తమ ఆశయాలను నిర్దేశించుకుని లక్ష్యాలను సాధించుకోవాలని చెప్పారు. మలినేని మధురిమ మాట్లాడుతూ ప్రతి విద్యార్థినీ మలినేని ఇంటి ఆడపడుచులని వారి బంగారు భవిష్యత్‌కు కళాశాల వేదికగా పునాదులు వేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ గౌతమి, డాక్టర్ సునీత, ఎన్‌సీసీ కోఆర్డినేటర్ సుబ్బారావు పాల్గొన్నారు.



మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓ కెనడీ

కిట్స్ ఇంజినీరింగ్‌లో..

ప్రత్తిపాడు: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని పలువురు పేర్కొన్నారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడు కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. యోగ ట్రైనర్ డాక్టర్ కె.శ్రీవిద్య, ఏపీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టు మేనేజర్ పి.యశస్విని హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీవిద్య మాట్లాడుతూ నేటి తరం మహిళలు ఎన్నో కష్టనష్టాలు, ఆటుపోట్లను ఎదుర్కొని జీవితంలో ఉన్నత స్థితికి చేరుకుంటున్నారని పేర్కొన్నారు. యశస్విని మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి పొందుతూ కుటుంబ ఆర్థిక స్థితిగతుల్లో భాగస్వాములవుతున్నారని చెప్పారు. కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు మాట్లాడుతూ తమ కళాశాలలో మహిళా అధ్యాపకులు పురుష అధ్యాపకులతో సమానంగా పోటీ పడుతూ కళాశాల అభివృద్ధికి తోడ్పాటునందిస్తున్నారని చెప్పారు. కళాశాల సెక్రటరీ కె.శేఖర్ మాట్లాడుతూ అధ్యాపకులు సాధారణ మహిళలు కారని, అత్యున్నతమైన విద్యా, సాంకేతిక నైపుణ్యాలున్న వారని తెలిపారు. తొలుత మహిళా అధ్యాపకులు, విద్యార్థినులకు ఆటల పోటీలు నిర్వహించారు. సంప్రదాయ వస్త్రాలంకరణతో విద్యార్థినులు చేసిన పలు కళా ప్రదర్శనలు అలరించాయి. ఎన్ఎస్ఎస్ యూనిట్, గుంటూరు నెహ్రూ యువకేంద్ర సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన నారీశక్తి పోటీల్లో విద్యార్థినులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ పి.బాబు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ హరిబాబు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి కృషి

కొండపాటూరు(కాకుమాను): మహిళా సంక్షేమానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంఈఓ కెఎఫ్ కెనడీ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండలంలోని కొండపాటూరు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం మహిళా ఉపాధ్యాయులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. ఎంఈఓ కెనడీ మాట్లాడుతూ సమాజంలో మహిళల పట్ల ఉన్న వివక్షతను వదిలి ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించాలని ఆయన సూచించారు. విద్యా, ఉద్యోగ రంగాల్లో ప్రభుత్వం మహిళలకు 33శాతం రిజర్వేషన్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి కల్పించినట్లు ఆయన తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులను పూల మాలలు,శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శీలం అంకారావు పాల్గొన్నారు.

అక్క చెల్లెమ్మలకు చేయూతతో ఆర్థికాభివృద్ధి

- పార్టీ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్
- డాక్టర్ వైఎస్సార్ చేయూత చెక్కుల పంపిణీ



చేయూత నమూనా చెక్కు అందజేస్తున్న సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: అక్క, చెల్లెమ్మలను వ్యాపారవేత్తలుగా తయారు చేసి వారి కుటుంబాల అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. నగరంలోని మండల పరిషత్ కార్యాలయంలో డాక్టర్ వైఎస్సార్ చేయూత చెక్కుల పంపిణీ గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు మాత్రమే కాకుండా అగ్రవర్ణాల పేదలకు సంక్షేమ పథకాలను ఇంటివద్దకే అందించటం ధ్యేయంగా జగనన్న సంక్షేమ పాలన అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో భాగంగా రూరల్ మండలంలోని 1,587 మందికి డాక్టర్ వైఎస్సార్ చేయూత నాలుగో విడతలో భాగంగా రూ.2,97,56,250 నమూనా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇంటూరి పద్మావతి అంజిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు తుమ్మల సుబ్బారావు, వైస్ ఎంపీపీ దర్శి సుజాత, సర్పంచులు మబ్బు శిరీష, ఆరుదల సాంబశివరావు, వైఎస్సార్‌సీపీ సేవాదళ్ స్టేట్ ఉపాధ్యక్షుడు మెట్టు వెంకటప్పారెడ్డి, ఎంపీడీవో ఆదినారాయణ పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయంలో మహిళాదినోత్సవం..

మహిళలను మహారాణులు చేయటం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ప్రత్తిపాడు నియోజకవర్గం సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నగరంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. కేక్ కట్‌చేసి అక్కచెల్లెమ్మలకు స్వీట్లు పంచారు. మహిళలకు నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇంటూరి పద్మావతిఅంజిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల సుబ్బారావు, వైస్ ఎంపీపీ దర్శి సుజాత, సర్పంచులు మబ్బు శిరీష, ఆరుదల సాంబశివరావు, మెట్టు వెంకటప్పారెడ్డి, ఎంపీడీఓ ఆదినారాయణ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురు టీడీపీ నాయకుల చేరిక

ప్రత్తిపాడు: వైఎస్సార్ సీపీ విజయంలో అందరూ భాగస్వాములు కావాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ కోరారు. ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు పత్తిపాటి దేవరాజు, పత్తిపాటి రామస్వామితో పాటు పలువురు టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీలో చేరారు. గుంటూరులో పార్టీ కార్యాలయంలో గురువారం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కిరణ్‌కుమార్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోనికి ఆహ్వానించారు. పార్టీ మీకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. దేవరాజు సుమారు పాతికేళ్లగా టీడీపీలోనే క్రియాశీలకంగా పనిచేస్తున్నారు.

మహిళలు నైపుణ్యాలపై పట్టు సాధించాలి

- డీఆర్‌డీఓ, సీఎంఎస్‌డీఎస్ డైరెక్టర్ డాక్టర్ మధుమిత చక్రవర్తి
- 'విజ్ఞాన్'లో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



విజ్ఞాన్‌లో మధుమితను సన్మానిస్తున్న దృశ్యం

చేబ్రోలు: మహిళలు అవకాశాల కోసం ఎదురుచూడొద్దని, విజ్ఞానం, నైపుణ్యం పెంచుకుంటే ఏదైనా సాధించవచ్చని డీఆర్‌డీఓ, సీఎంఎస్‌డీఎస్ డైరెక్టర్ డాక్టర్ మధుమిత చక్రవర్తి పేర్కొన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ ఏడాది 'ఇన్‌స్పైర్ ఇన్‌క్లూజన్' అనే అంశంతో వేడుక నిర్వహించారు. మధుమిత చక్రవర్తి మాట్లాడుతూ మహిళలు జీవితంలోనూ, సమాజంలోని సమస్యలపై పోరాటం చేయాలని సూచించారు. మహిళలు ఎప్పుడూ కూడా తమ భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవాలని పేర్కొన్నారు. అవినయ నాచురల్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ బాలకృష్ణ కోడూరు మాట్లాడుతూ మహిళల్లోనే వైవిధ్యమైన నాయకత్వ లక్షణాలు ఉంటాయని, ఎందరో మహిళలు దేశ నాయకులుగా చరిత్ర సృష్టిస్తూ, జాతి దశను, దిశను మార్చేస్తున్నారని తెలిపారు. స్త్రీలు స్వతహాగా శక్తి స్వరూపులని వివరించారు. వివిధ అంశాలలో నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు, అధ్యాపకులకు బహుమతులను అందజేశారు. వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్ పాల్గొన్నారు.

బాలకోటేశ్వరస్వామిని దర్శించుకున్న అంబటి మురళీకృష్ణ



అంబటి మురళీకృష్ణను సన్మానిస్తున్న దేవదాయశాఖ అధికారులు

చేబ్రోలు: శివునికి అత్యంత ప్రీతికరమైన రోజు మహా శివరాత్రి అని పొన్నూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పేర్కొన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడిలోని క్వారీ బాలకోటేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం అంబటి మురళీకృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. దేవదాయశాఖాధికారి పోతుల రామకోటేశ్వరరావు ఘనంగా సత్కరించారు.

మహిళా సాధికారతతో సమాజాభివృద్ధి



పెదకాకాని: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం(రీసెర్చ్, డెవలప్‌మెంట్) డైరెక్టర్ డాక్టర్ సుమిత శంకర్ పేర్కొన్నారు. పెదకాకాని మండలం, తక్కెళ్లపాడు సిబార్ దంత వైద్య కళాశాలలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు కళాశాల డీన్ డాక్టర్ ఎల్.కృష్ణప్రసాద్ అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విజయవాడ డాక్టర్ వైఎస్సార్ విశ్వవిద్యాలయ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ డైరెక్టర్ డాక్టర్ సుమితా శంకర్ విచ్చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుమిత శంకర్ మాట్లాడుతూ సమాజంలో మహిళల భాగస్వామ్యం బాగా పెరిగింది అన్నారు. పురోగతిలో వారి యొక్క భాగస్వామ్యాన్ని ఆమె వివరించారు. మహిళా సాధికారతతో సమాజాభివృద్ధి జరుగుతుందని చెప్పారు. సమాజ శ్రేయస్సుకు మహిళలు కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. వైద్య, ఆరోగ్య రంగాల్లో మహిళల పురోగతిని ఆమె కొనియాడారు. కార్యక్రమంలో భారతీయ దంత వైద్య మండల సభ్యురాలు డాక్టర్ పి.రేవతి, ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ రమణారెడ్డి, ఓరల్ మెడిసిన్ బాగధిపతి డాక్టర్ వై.సమత, డాక్టర్ ఎం.కళ్యాణి పాల్గొన్నారు.

డెప్యూటీ డీఈఓ వసూళ్ల వ్యవహారంపై విచారణ

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు డీవైఈఓ పి.వెంకటేశ్వరరావుపై వచ్చిన అవినీతి ఆరోపణలపై పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి గురువారం విచారణ చేపట్టారు. జిల్లాలోని వివిధ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల్ని తన కార్యాలయానికి పిలిపించుకుని గోప్యంగా విచారణ జరిపారు. తనిఖీలకు, సందర్శనలకు వెళ్లిన సమయంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి వసూళ్లకు పాల్పడటంతో పాటు వివిధ రకాలుగా వేధింపులకు పాల్పడిన ఘటనలపై హెచ్ఎంలు, పాఠశాలల యాజమాన్యాలు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. దీనిపై విచారణ జరిపిన ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి హెచ్ఎంలు చెప్పిన అంశాల వారీగా పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌కు నివేదిక పంపనున్నట్లు వెల్లడించారు.

దేశానికే ఆదర్శంగా జగనన్న పాలన

బజరంగ్ ఫౌండేషన్ అధినేత, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ



వైద్య శిబిరంలో పాల్గొన్న వారితో అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావిస్తూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని బజరంగ్ ఫౌండేషన్ అధినేత, పొన్నూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ తెలిపారు. గురువారం పట్టణంలోని జెడ్పీ హైస్కూల్‌లో బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బజరంగ్ జగన్నామ సంక్షేమ సంగమం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి వ్యక్తికి, వర్గానికి, వృత్తులకు, వ్యవసాయానికి, అగ్రవర్ణ పేదలకు సంక్షేమలు అందించి రాజ్యాంగాన్ని తూచా తప్పకుండా పాటించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అని తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆర్బీకేలు, గ్రామ, వార్డు సచివాయాలు, వలంటీర్, రేషన్ పంపిణీ వ్యవస్థ వంటి విప్లవాత్మక కార్యక్రమాలపై అధ్యయనం చేసేందుకు పలు రాష్ట్రాల నుంచి అధికారుల బృందాలు రావడం గమనార్హమన్నారు. నవరత్నాలు అందుకున్న ప్రతి ఒక్కరు జగన్ గెలుపు కోసం సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఆయన ఆలోచనలను పుణికి పుచ్చుకొని బజరంగ్ ఫౌండేషన్ అనేక సేవా కార్యక్రమాలను చేస్తోందని వివరించారు. అందులో భాగంగా బజరంగ్ జగన్నామ సంక్షేమ సంగమం పొన్నూరులో కులమతాలకు, పార్టీలకు అతీతంగా నిర్వహించిన శిబిరంలో ప్రజలు వచ్చి కంటి పరీక్షలు, గుండె పరీక్షలు, ఫిజియోథెరపీ సేవలను వినియోగించుకున్నారు. వీరిలో అవసరమైన వారికి యాంజియోగ్రామ్ కోసం శనివారం ఉదయం ప్రత్యేక వాహనంలో విజయవాడకు తీసుకుని వెళ్లడం జరుగుతుందని తెలిపారు. జగనన్న సంక్షేమ పాలనలో గత సంవత్సర కాలంగా బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంలో కంటి సమస్యల నివారణకై నేత్రజ్యోతి కార్యక్రమంలో ఉచిత నేత్ర వైద్య పరీక్షలు అనంతరం అవసరమైన వారికి ఏడు పనిదినాల్లో కళ్లజోళ్ల పంపిణీ, మీ గుండె పదిలం కార్యక్రమంలో ఉచిత గుండె పరీక్షలు అవసరమైన వారికి యాంజీయోగ్రామ్ నిర్వహించి సమస్య ఉన్నవారికి స్టంట్స్, బై పాస్ సర్జరీలు చేయించడం జరిగిందన్నారు. దివ్యాంగ దర్శిని కార్యక్రమంలో దివ్యాంగులకు ట్రై సైకిల్స్, జై పూర్ కాలు, వెస్ట్రన్ కమోడ్లు అందజేయడం జరిగింది. వృద్ధులు మహిళలు వికలాంగులను శిబిరానికి ప్రత్యేక వాహనాల ద్వారా తీసుకువచ్చి, పరీక్షలు నిర్వహించి తిరిగి పంపించడానికి ఏర్పాటు చేయడం పట్ల పొన్నూరు వాసులు హర్షం వ్యక్తం చేశారు.

స్వప్నకు డాక్టరేట్ ప్రదానం



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ రసాయనశాస్త్ర పరిశోధకురాలు జి. స్వప్నకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని రీసెర్చ్ సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కిరణ్మయి తెలిపారు. రసాయనశాస్త్ర పరిశోధన పర్యవేక్షకులు ఆచార్య బి. కేశవరావు పర్యవేక్షణలో 'ఐసోలేషన్, కేరక్టరైజేషన్ ఇన్ సిలికో యాంటీఫర్టిలిటీ డాకింగ్ స్టడీస్, ఫార్మకోలాజికల్ ఏ వాల్యుయేషన్ ఆఫ్ నేచురల్ అండ్ సింథటిక్ క్రొమినో పైరోజోలోన్స్ ఫ్రమ్ కార్డియో డైకొటమా జి ఫ్రాస్ట్- బొరాగినేసి' అనే అంశంపై పరిశోధన గ్రంథం సమర్పించినందుకుగాను డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఆమె పేర్కొన్నారు.